క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

వెదురుకుప్పం: మండలంలోని జీటీ కండ్రిగ వద్ద ఉన్న పీఆర్పీ(కన్వెన్షన్ హాల్)లో శనివారం ఉదయం 9.30 గంటలకు ×బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ× కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కే. పద్మనాభరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తుండటంపై రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం ద్వారా మోసాలు, అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు చెప్పారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జగనన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పాలల్లో వెన్న శాతం పెంపుపై అవగాహన


మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ మునిక్రిష్ణారెడ్డి

పాలసముద్రం : మండలంలోని శ్రీజ డెయిరీలో పాలల్లో వెన్నశాతం బట్టి బిల్లులు వస్తాయని డెయిరీ మిల్క్ ప్రొడక్షన్ కో-ఆర్డినేటర్ మునిక్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అయ్యప్పరాజుకండ్రిగలో పాడి రైతులకు పాలల్లో వెన్నశాతం పెంపుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వెన్నశాతం పెరగడానికి నాణ్యమైన పశుగ్రాసం, మిశ్రమ దాణా పాడి రైతులకు ఇస్తున్నట్లు చెప్పారు. చూడి పశువులను ఎక్కువ దూరం నడిపించడం, పరుగెత్తించడం, ఎత్తు ప్రదేశాలకు వెళ్లనివ్వడం చేయరాదన్నారు. ఇంట పాడిపశువులు ఉంటే అదే ఒక ప్రభుత్వ ఉద్యోగంతో సమానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివకుమార్, పాడి రైతులు పాల్గొన్నారు

తండ్రి బాటలో తనయుడు


రోగులకు పండ్లు పంపిణీ

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయలచెరువు బాలాజీ జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పళ్లు, స్వీట్లు పంచారు. అన్నదానం చేశారు. అలాగే రాత్రి రాస్ వృద్ధాశ్రమంలోనూ అన్నదానం చేశారు. కార్వేటినగరం సర్పంచ్ ధనంజయ వర్మ మాట్లాడుతూ, మాజీ జెడ్పీటీసీ, పార్టీ సీనియర్ నాయకుడు ఆర్.శ్రీరాములు నాయుడు బాటలోనే ఆయన కుమారుడు బాలాజీ కూడా తన పుట్టినరోజు పురస్కరించుకొని ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అన్నదాన కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుణ లోకనాథ నాయుడు. ఎంపీటీసీ మురుగయ్య. సాయికుమార్, గౌతమ్. డాక్టర్ శృతి భాగ్యం, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు: మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ జైసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈశ్వరాపురం, లక్ష్మీనగర్, కళ్యాణపురం వద్ద ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

జోరుగా ఇసుక దందా

విజయపురం మండలం కేవీశ్రీరామపురం కుశస్థలి నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రోజుకి వందల సంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు తన కార్యకర్తలతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, టీడీపీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. – విజయపురం

- అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకొని పోలీసు యంత్రాంగం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ శాఖ
- టీడీపీ నాయకులే సూత్రధారులు


ట్రాక్టర్ అడ్డుకొన్న కేవీ శ్రీరామపురం గ్రామస్తులు

సరిహద్దులు దాటుతున్న ఇసుక

తమిళనాడులో ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. దీంతో టీడీపీ నాయకులు తమిళనాడు వ్యాపారులతో చేతులు కలిపి పగటి పూట ఇసుక డంపింగ్ చేసుకొని, రాత్రి పూట తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో నగరి మండలం దామరపాకం సమీపంలో తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో నగరి డీఎస్పీ ఇసుక డంపును పట్టుకొని కేసు నమోదు చేశారు. అయినా టీడీపీ నాయకుల్లో ఎలాంటి మార్పు కనిసిపించడం లేదు. మళ్లీ ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

టీడీపీ నాయకులే కీలకం

కేవీపురం, కేవీశ్రీరామపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులకు పెద్ద నాయకుడితో మంచి పరిచయం ఉంది. దీంతో రెవెన్యూ సిబ్బంది వారిని చూసి భయపడుతున్నారు. బండి పట్టుకున్నా... కేసు నమోదు చేసినా పైనుంచి ఫోన్ వస్తుందన్న భయంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మా బండే తిరగాలి

ప్రభుత్వం మాది, మేము చెప్పినా బండ్లే తిరగాలని, ఇతరులు ఎవరైనా బండి తీసుకొస్తే కేసు పెట్టి కోర్టుకు పంపిస్తామంటూ ఓ టీడీపీ నాయకుడు ట్రాక్టర్ యజమానులను బెదిరిస్తున్నాడు. కేవీపురం, కేవీశ్రీరామపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను డంపింగ్ చేసి రాత్రి పూట తమిళనాడు సరిహద్దు ప్రాంతానికి తరలిస్తున్నారని స్థానిక నాయకులు వాపోతున్నాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భయపడుతున్న ప్రజలు

రోజుకి వందల సంఖ్యలో కేవీశ్రీరామపురం కుశస్థలి నది నుంచి ట్రాక్టర్లు తిరుగుతుంటే స్థానిక ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. చిన్నారులు సైతం బయట ఆడుకోవడం కోసం బయటకు రావటం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. రోడ్లు సైతం గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిపోయింది. ప్రశ్నించిన స్థానికులపై స్థానిక టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ఆర్ సీపీ నియామకాలు

పుత్తూరు: వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అనుబంధ విభాగాల్లో పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన పలువురిని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా పి.సారా సుబ్రమణ్యం, కల్చరల్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎ.మురళీరెడ్డి, బీసీ సెల్ సెక్రటరీగా కె.మనోహర్‌రెడ్డి, కల్చరల్ వింగ్ సెక్రటరీగా పి.నారాయణరెడ్డి, గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా కె.గురవయ్య, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సుదర్శన వర్మ రాజు, బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కె.భాస్కర్‌రెడ్డి, వైఎస్ఆర్ టీయూసీ వింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బి.ఎస్.లారీమోహన్, గ్రీవెన్స్ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సి.మునయ్య, బూత్ కమిటీ వింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్.సుబ్రమణ్యం(శీను), ఆర్టీ వింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్.హరిప్రసాద్(జెసీబీ), ఐటీ వింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎ.లోకనాథం(కుట్టి)లను నియమించారు.

వైఎస్ఆర్ సీపీ నేత మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు

నగరి: మండలంలోని ఓజీ కుప్పం గ్రామానికి పార్టీ నేత కస్తూరమ్మ గుండెపోటుతో మృతిచెందారు. శుక్రవారం ఓజీ కుప్పం గ్రామానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆమె కుమారుడు సుందరంను ఓదార్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ మోహన్, పార్టీ నాయకులు బుజ్జిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


గుంజకు పసుపు కుంకుమ పెడుతున్న మహిళలు


శాస్త్రోక్తంగా పందిరి గుంజ ఏర్పాటు

పుత్తూరు: పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం వద్ద శుక్రవారం పందిరి గుంజను శాస్త్రోక్తంగా ఏర్పాటు చేయడం ద్వారా వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం పందిరి గుంజకు మహిళలు పాలాభిషేకం నిర్వహించి, పసుపు కుంకుమ బొట్లు పెట్టి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, అర్చక స్వాముల మంత్రోచ్ఛారణ నడుమ పందిరి గుంజను శాస్త్రోక్తంగా నాటారు. దీంతో ఆగస్టు 1వ తేదీ నుంచి 11 వరకు 10 రోజుల పాటు జరగనున్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు నాంది పలికారు.

జనాభా నియంత్రణతోనే సంక్షేమం


అవగాహన ర్యాలీ చేస్తున్న ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం: జనాభా నియంత్రణతోనే కుటుంబ సంక్షేమ దిశగా ఒక అర్థవంతమైన భవిష్యత్తుకు ప్రారంభమని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు జయకుమార్, మోహన్‌క్రిష్ణ తెలిపారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ, పిల్లలకు సరైన వయస్సులోనే వివాహం చేయాలని, ప్రసవానంతరం కుటుంబ నియంత్రణ చేయాలన్నారు. జనాభా నియంత్రణకు ఒకరు లేదా ఇద్దరు పిల్లలకు మాత్రమే పరిమితం కావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధిక జనాభా దేశాభివృద్ధికి తోడ్పాటు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: అధిక జనాభా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని స్థానిక ఎస్ఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభాను సమస్యగా చూడరాదన్నారు. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభివృద్ధిని సాధించవచ్చునని తెలిపారు. జనాభా పెరుగుదలతో ఆరోగ్య, నిరుద్యోగం తదితర సమస్యలు ఏర్పడినా, ప్రభుత్వాలు సమగ్ర అభివృద్ధి, సురక్షిత భవిష్యత్తు కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు, వరలక్ష్మీ, బాబురావు, సుజన, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణస్వామిపై దుష్ప్రచారం చేస్తే సహించం

వెదురుకుప్పం: మాజీ ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామిపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు ఎం.నాగరాజు హెచ్చరించారు. నారాయణస్వామిపై ఇటీవల టీడీపీ నాయకుడు సుధాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై శుక్రవారం వెదురుకుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండిపడ్డాడు. గతంలో నారాయణస్వామి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యనమలమందలో 50 మంది ఎస్సీలపై అక్రమంగా కేసులు పెట్టించాడంటూ దుష్ప్రచారం చేయడంలో వాస్తవం లేదన్నారు. వెదురుకుప్పంలో పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారేతప్ప తమ నాయకుడికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అప్పటి ఎస్పీ రిషాంత్ రెడ్డిని గ్రామానికి రప్పించి ఎస్సీలపై కేసులు లేకుండా చేసే ప్రయత్నం చేసినట్లు చెప్పారు. సుధాకర్ వల్లనే అమాయకులు కేసులో ఇరుక్కున్నట్లు ఎస్సీలు తెలుసుకున్నారని, అసలు కేసుల్లో ఇరుక్కున్న వారంతా తమ ఆర్టీ సానుభూతిపరులేనన్నారు. నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేకుంటే ఈరోజు ప్రాణాలతో ఉండేవాడు కాదనే విషయాన్ని మరచి దళితులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. నారాయణస్వామిపై కారు కూతలు కూస్తే తగిన గుణపాఠం చెప్తామన్నారు.

నా చివరి శ్వాస వరకు వైఎస్సార్‌సీపీలోనే..!

- అసత్య వార్తలు, సోషల్ మీడియా పోస్టులు నమ్మకండి
- కటికపల్లె సర్పంచ్ మార్కొండయ్య



మాట్లాడుతూన్నా కటికపల్లె సర్పంచ్ మార్కొండయ్య

శ్రీరంగరాజపురం : తన చివరి శ్వాస వరకు వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని కటికపల్లె సర్పంచ్ మార్కొండయ్య స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గురువారం తమ గ్రామంలో సుపరిపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే థామస్, ,చిత్తూరు ఎంపీ ప్రసాద్‌రావు హాజరయ్యారని, వారు తమ నివాసం వద్దకు రావడంతో సర్పంచ్‌గా వారిని శాలువతో గౌరవించినట్లు చెప్పారు. అలాగే పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని వారిని కోరినట్లు తెలిపారు. అయితే దీనిపై కొన్ని పత్రికలు..తాను టీడీపీలో చేరినట్లు ప్రచరించడం ఎంతమాత్రమూ సరికాదని ఆక్షేపించారు. అలాగే, సామాజిక మాధ్యమాల్లో సైతం అలాగే పోస్టులు పెట్టారని మండిపడ్డారు. తన ఊపిరి ఉన్నంతవరకు పార్టీని వీడే ప్రసక్తే లేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహకారంతో సీసీ రోడ్లు, రైతు భరోసా, సచివాలయం, విలేజ్ క్లినిక్, మురుగు కాలువలు, జగనన్న కాలనీలు నిర్మించామని స్పష్టీకరించారు. ఇప్పుడు పంచాయతీతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హానికర ప్లాస్టిక్‌పై పోరుకు శ్రీకారం


హానికర ప్లాస్టిక్‌ను రోడ్డుపై వేస్తున్న డీఎస్పీ, కమిషనర్

నగరి: మున్సిపల్ పరిధిలో హానికర ప్లాస్టిక్‌పై పోరుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టగా పోలీసులు సహకారం అందించారు. నిషేధించడంలో భాగంగా డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ కేవీ.కృష్ణారెడ్డి పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో హోల్‌సేల్ దుకాణాల్లో ఉంచిన సుమారు 100 కిలోల నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని వారికి రూ.8000 జరిమానా విధించారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులను రోడ్డుపై వేసి అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన మానవ, మూగజీవుల ప్రాణాలకు హానికలుగుతుందన్నారు. అలాంటి ప్లాస్టిక్‌ను నిషేధించడం ముఖ్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ హానికర ప్లాస్టిక్ వాడకంపై నిషేదం ఉందన్నారు. నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠినమైన చర్యలు తప్పవన్నారు. సమావేశానంతరం మున్సిపల్ సిబ్బందితో కలిసి టవర్ క్లాక్ కూడలి వరకు నిషేధిత ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ విక్రమ్, రెవెన్యూ ఆఫీసర్ తారక రామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోమియోతో అద్భుత ఫలితాలు


వార్షికోత్సవంలో హోమియో వైద్య విద్యార్థులు

పుత్తూరు: హోమియో వైద్యం ద్వారా అద్భుత ఫలితాలను పొందవచ్చునని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. శుక్రవారం స్థానిక కేకేసీ హోమియో మెడికల్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ నేటి సమాజంలో హోమియో వైద్యానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ వైద్యం పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సినీ నటి ప్రజ్ఞన మన్ వార్షికోత్సవ సభలో పాల్గొని విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో స్థానిక కేకేసీ హోమియో వైద్య కళాశాల చైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, వైస్ చైర్మన్లు కె.నరసింహారావు, కె.రవిశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరవణన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేవలామృతంపై ప్రవచనాలు ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం శ్రీ నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో కేవలామృతంపై ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాధా మనోహర్ దాస్ ప్రవచన కర్తగా పాల్గొన్నారు. తొలుత శ్రీనారాయణి అమ్మకు ప్రత్యేక పూజలు చేసి ప్రవచనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ అవసరమన్నారు. ప్రతి ఒక్కరికీ హిందూ తత్వంపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

పంట మార్పిడి శ్రేయస్కరం

- చీడపీడల నుంచి రక్షణ
- ఒకే పంట సాగుతో అనర్థాలు


ఎం.కొత్తూరులో వంగతోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నగరి: రైతులు తమ పొలంలో ఒకసారి సాగు చేసిన పంటనే మళ్లీమళ్లీ సాగు చేస్తుండడంతో నేలలో సారం తగ్గిపోయి పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. దీంతో నష్టాలు చవిచూస్తున్నారు. పంట మార్పిడి చేయక పోవడంతో చీడపీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుంది. వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉన్నందున రైతులు ఒకే పంటను ప్రతి సీజన్లో సాగు చేస్తున్నారు. దీని వలన భూసారం క్షీణించడంతోపాటు పంటలపై చీడపీడలు విజృంభించి దిగుబడులు క్రమేపి తగ్గుతున్నాయి. 2 లేదా 3 సంవత్సరాలకోసారైనా పంట మార్పిడి చేస్తేనే చీడపీడలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుంది. దీనిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. పంట మార్పిడితో భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయని వ్యవసాయాధికారి రాఘవేంద్రయాదవ్ తెలిపారు. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించవచ్చు. భూమిలో నాణ్యత పెరిగి దిగుబడులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.

పంట మార్పిడితో లాభాలు

- చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించిన చీడపీడలు రెండవ పంటను ఆశించవు.
- మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగు చేయకుండా ఉంటే మంచిది. మిరపను సాగుచేస్తే నష్టం తప్ప లాభం వచ్చే అవకాశం లేదు.
- మిశ్రమ విధానంలో రెండు లేదా మూడు పంటలను సాగుచేయడంతో ఒక పంటకు గిట్టుబాటు ధర లేకున్నా ఇతర పంటలతో తగిన ఆదాయం పొందవచ్చు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- రైతులందరూ ఒకే పంటను సాగు చేయడం ద్వారా చీడపీడల ఉధృతి అధికమై దిగుబడులు తగ్గడమే గాక మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు.
- సస్యరక్షణ కోసం వాడే పురుగు మందుల ఖర్చు తగ్గించవచ్చు.
- వేర్లు తక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లను, ఎక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లతో మార్పిడి చేయడంతో భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థంగా వినియోగించుకుంటాయి.
- మిరప పంట సాగు చేయడానికి ముందు సదరు భూమిలో జనుము, జిలుగ, పిల్లి పెసర పంటలను సాగుచేసి నేలలో కలియ దున్ని పంటను సాగు చేస్తే భూసారం పెరిగి చీడ పీడలు దరిచేరవు.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీని వల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలను కానీ నూనె గింజల పంటలను కానీ సాగు చేయడం వలన తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు ఎర్రమట్టి నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చు.
- కంది మొదలగు పంటలను సాగు చేయడంతో కింది పైరు ఆకులు రాలి కుళ్లిపోవడంతో నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతికస్థితి మెరుగుపడి భూసారం వృద్ధి చెందుతుంది. నేలలో నీటిని పట్టి ఉంచే శక్తి గణనీయంగా పెరిగి, తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. వేరుశనగ, కంది, పప్పుశనగ మొదలగు సాగు చేయడంతో వాటి వేర్ల బుడిపెలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్థిరీకరించి నేలను సారవంతం చేస్తుంది.
- వాతావరణ కాలుష్యాన్ని నివారించి ప్రకృతిలో సమతుల్యతను పెంచడానికి వీలు కలుగుతుంది.

21న జేఎల్ఎంలు చలో విజయవాడ

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు తెలిపారు. తమ డిమాండ్ల పై శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఒకే రకమైన సర్వీసు రూల్ అమలు చేయాలన్నారు. తమ సమస్యలపై పలుమార్లు అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగులతో సమానంగా సెలవులు, భత్యాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరి, విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.